సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం ၊ 9 ၊ అక్టోబర్ ၊ 2024



విశాఖ జట్టు విజయభేరి
కడపలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు విజయభేరి మోగించగా, ప్రకాశం, చిత్తూరు జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. -IIలో



వైఎస్సార్ సేవలు వెలకట్టలేనివి
వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగానే కాకుండా ప్రతిపక్ష నేతగా ఉమ్మడి రాష్ట్రానికి అందించిన సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
34.5/25.3

వాతావరణం
జిల్లాలో మంగళవారం 25.3 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

181 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 181 మంది గైర్హాజరయినట్లు డీఈఓ మర్రెడ్డి అనూరాధ తెలిపారు. జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు-2024కు 1833 మందికిగాను 1652 మంది హాజరయినట్లు ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా టెట్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డీఈఓ వివరించారు.

ఆర్‌జేడీగా డాక్టర్ గిరి




ఆర్‌జేడీ గిరికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపకులు

వైవీయూ: కళాశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా డాక్టర్ డి. గిరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులోని డి.కె. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈయన్ను కడప, చిత్తూరు జిల్లాల ఆర్‌జేడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కడప నగరంలోని ఆర్‌జేడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కడప, చిత్తూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని దానికి అనుగుణంగా బాధ్యతలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్‌జేడీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గిరిని పలువురు అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ మర్రెడ్డి అనూరాధ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 8న ఈ పరీక్ష జరగనుంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలతోపాటు వసతి సదుపాయం లేని మోడల్ స్కూళ్లలో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు ఏటా రూ. 12 వేల చొప్పున మొత్తం నాలుగేళ్ల రూ. 48 వేలు ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందని తెలిపారు.

నిత్యాన్నదానానికి లక్ష విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళంగా చెక్కును అందజేస్తున్న దాత రామాంజనేయరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రూ.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన కుప్పన్నగారి సంజీవరెడ్డి కుమారుడు రామాంజనేయరెడ్డి కుటుంభ సభ్యులతో వచ్చి విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారని చెప్పారు.

నేటితో మద్యం షాపుల దరఖాస్తు గడువు ముగింపు

రాజంపేట: మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కడప డిప్యూటీ కమిషనర్ జయరాజ్ అన్నారు. మంగళవారం రాజంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం షాపుల విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఉన్నత విద్యకు ఉపకార వేతనాలు

కడప ఎడ్యుకేషన్: పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం స్కాలర్‌షిప్ టెస్టును ఈ నెల 26న నిర్వహించనున్నట్లు షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలోని బీదర్‌లో తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి వేల మంది మెడిసిన్, ఇంజినీరింగ్ సీట్లు పొందారని, విద్యార్థుల ఉన్న విద్యను ప్రొత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 22వ తేదీలోపు తమ వెబ్ సైట్ www.shaheengroup. org/cuetలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన విద్యార్థులకు ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇస్తా మని తెలిపారు. వివరాలకు ఫోన్: 85498 97767, 1800 121 6235 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

చిరుద్యోగులపై కన్నెర్ర!


తెలుగుదేశం ప్రభుత్వం చిరుద్యోగులపై కన్నెర్ర చేస్తోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించాల్సింది పోయి.. ఉన్న చిరుద్యోగాల్ని ఊడగొడుతూ వీధిపాలు చేస్తోంది. కోపముంటే ఓ దెబ్బ వీపుపై కొట్టాలే గానీ.. కడుపుమీదకొట్టకూడదని పెద్దలు చెబుతారు. టీడీపీ నేతలు రాజకీయ కక్షతో చిరుద్యోగుల కడుపుమీదే కొడుతున్నారు. చిన్నాచితకా ఉపాధి మార్గాల్ని దూరం చేస్తూ వారి కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నారు.

- కమలాపురం గురుకులంలో ఆరుగురికి ఉద్వాసన
- ఎమ్మెల్యే ఫిర్యాదు కారణంగా ఉద్వాసన చేసినట్లు ఉత్తర్వులు
- వలింటీర్ల వ్యవస్థ రద్దుతో 10,890 మంది వీధిపాలు
- ఇంటి వద్దకే రేషన్ పాలసీ రద్దుతో మరో 366 మంది
- నూతన మద్యం పాలసీతో ఇంకో 1,054 మంది
- రాజకీయ కక్షతో వీధిపాలవుతున్న యువకులు



సాక్షి ప్రతినిధి, కడప: పాలకులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని యువత కోరుకోవడం సహజం. టీడీపీ కూటమి సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ పాలసీ అంటూ ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టి యువత ఉపాధికి గండికొడుతోంది. అది చాలదన్నట్లు క్షేత్రస్థాయిలో టీడీపీ ఎమ్మెల్యేలు రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు చేర్చింది. ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా వలంటీర్ల వ్యవస్థను నెలకొల్పి గ్రామాల్లో యువతకు ఉపాధి కల్పించింది. టీడీపీ అధికారంలోకి రాగానే, వలంటీర్ల జీతం రెట్టింపు చేస్తామంటూ ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ప్రకటించారు. అధికార పీఠంపై కూర్చోగానే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టేశారు. తద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది యువకులకు ఉపాధి కోల్పోగా, వైఎస్సార్ జిల్లాలో దాదాపు 10,890 మంది నిరాశ్రయులయ్యారు.
- ఇంటి వద్దకే రేషన్ కార్యక్రమాన్ని సైతం మరుగున పెట్టడంతో జిల్లాలో 366 మంది వెహికల్ ఆపరేటర్లు ఉపాధి కోల్పోయారు.
- నూతన మద్యం పాలసీ తీసుకరావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్స్, వాచ్‌మెన్లు మరో 1,054 మంది నిరాశ్రయులయ్యారు. ఉపాధి కోల్పోతున్న వారు రోజు రోజుకు ఇలా పెరుగుతూ పోతుండగా రాజకీయ కక్ష వల్ల మరింతమంది ఉద్యోగాలు కోల్పోయి వీధినపడుతున్నారు.



కమలాపురం ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన ఉద్యోగుల జాబితా

కమలాపురం ఎమ్మెల్యే ఫిర్యాదుతో....

కమలాపురం మహాత్మాగాంధీ జ్యోతిభాపూలే బీసీ సంక్షేమ గురుకులంలో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులపై కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఓ ఫిర్యాదు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా ఆరోపణలు వచ్చాయి, చర్యలు తీసుకోవాలంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదులో వాస్తవాలు ఉన్నాయా? లేవా? అన్న పరిశీలన, ఎలాంటి విచారణ లేకుండా ఏకంగా ఆరుగురు చిరుద్యోగులకు ఉద్వాసన (రీమూవ్ ఫ్రమ్ సర్వీసు) పలికారు. అందులో ఐదేళ్లుగా పనిచేస్తున్నవారు ఉన్నారు. ఆ ఐదేళ్ల కాలంలో వారి సర్వీసులో ఎలాంటి ఆరోపణలు లేకపోవడం విశేషం. అయినప్పటికీ ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు మహాత్మాగాంధీ జ్యోతిభాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల స్టేట్ సెక్రెటరీ కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులతోనే ఫిర్యాదు చేసినట్లు బాధితులు వాపోతున్నారు.

తొలగించడం అన్యాయం



నేను కమలాపురంలోని బీసీ గురుకుల విద్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నా. ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారంటూ నాతో పాటు ఆరు మంది ఉద్యోగులను నోటీసులు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించారు. - కేటీ రాజులరెడ్డి, వల్లూరు మండలం

వైఎస్‌ఆర్‌సీపీకి మద్దతు ఇచ్చానని..



కమలాపురంలోని బీసీ గురుకుల విద్యాలయంలో 2023 జూన్ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను. గత ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీకి మద్దతు ఇచ్చాననే కారణంగానే కక్ష సాధింపుగా నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. -ఎస్ దుష్యంత్ రెడ్డి, వీరపునాయునిపల్లె మండలం

ఉపాధి కోల్పోయి వీధిన పడ్డాం



కమలాపురంలోని బీసీ గురుకుల విద్యాలయంలో కిచెన్ హెల్పర్‌గా పని చేస్తున్నాను. ఉన్నట్లుండి నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో ఉపాధి కోల్పోయి కుటుంబం వీధిన పడాల్సి వస్తోంది. రాజకీయ కారణాలతో తొలగించడం మమ్మల్ని అన్యాయం. - బి.రంగమ్మ, కమలాపురం

ఆందోళన కలిగిస్తోంది



పెండ్లిమర్రి మండలంలోని పాత సంగటిపల్లెలో వలంటీర్‌గా పని చేశాను. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా వలంటీర్లపై ఎలాంటి ప్రకటన చేయక పోవడం ఆందోళన కలిగిస్తోంది. -జీ శివ శంకర్‌రెడ్డి, గ్రామ వలంటీర్, పాత సంగటిపల్లె, పెండ్లిమర్రి మండలం

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



కూటమి ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ ద్వారా మేము ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. మా కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ఏదైనా ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలి. -కె.వి.నాగరాజు, సూపర్‌వైజర్, బద్వేలు



అమ్మవారిశాలలో శ్రీగజలక్ష్మీదేవి అలంకారం

శ్రీకరి.. శుభకరి..

లోకరక్షాకరి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవీ శరన్నవరాత్రుల వేడుకలు కన్నుల పండువగా సాగుతున్నాయి. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ఐరావతంపై శ్రీగజలక్ష్మీదేవి అంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవతా మూర్తుల సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకుంది. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో సంతానలక్ష్మీదేవి, శివాలయం, గౌరమ్మకట్టలో మంగళ గౌరిగా, వైఎంఆర్ సాయిబాబా ఆలయంలో వారాహి దేవిగా, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్ని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

14 నుంచి 'పల్లె పండుగ' వారోత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్: ఈనెల 14 నుంచి 20వ తేది వరకు జరగనున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండుగ, ఉపాధి హామీ, గ్రామసభలు వంటి పలు అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పల్లె పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులను సమన్వయ పరుచుకుని ఆమోదం పొందిన పనులకు భూమి పూజలు చేయాలన్నారు. జిల్లాలో గ్రామ సభల ద్వారా 983 పనులకు ఆమోదం లభించాయన్నారు. జిల్లాలో చేపట్టబోయే పనుల వివరాలను బోర్డుల ద్వారా ప్రదర్శించాలన్నారు. పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి, డ్వామా పీడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు


జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలను పటిష్ఠంగా నిర్వహిస్తామని కలెక్టర్ శివ శంకర్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీసీ నిర్వహించారు. ఈనెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్, నామినేషన్ పత్రాలు కలెక్టరేట్‌కు పంపుతామని మంత్రి తెలిపారు.

అపార్‌మైన ప్రయోజనం

- వన్ నేషన్.. వన్ స్టూడెంట్ పేరిట గుర్తింపుకార్డు
- సమాచారమంతా ఒకే కార్డులో నిక్షిప్తం
- దేశంలో ఎక్కడైనా సలభంగా చదువుకునే అవకాశం
- జిల్లావ్యాప్తంగా 60,024 మంది విద్యార్థులకు లబ్ధి



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు



కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న అపార్‌కార్డు

కడప ఎడ్యుకేషన్: ఎప్పుడో పదేళ్ల కిందట చదివిన స్టడీ సర్టిఫికెట్ అవసరం పడిందా.. అంతే హైరానా పడిపోతాం.. ఏ తరగతి ఎప్పుడు చదివాం.. అడ్మిషన్ల తేదీలు, టీసీలు... ఇలా స్కూళ్ల మారినప్పుడల్లా వివరాలు లెక్కలుగట్టి గుర్తుపెట్టుకోవడానికి నానా తంటాలు పడతాం.. ఇప్పుడా అవసరం ఉండదు.. అవును.. ఇప్పుడు కాలం మారింది.. ఆ లెక్కల చిక్కుముళ్లకు చెక్ పడుతోంది. భారత పౌరుడిగా పుట్టు పూర్వోత్తరాలు ఆధార్‌కార్డులో ఎలా నిక్షిప్తం చేశారో అలాగే విద్యార్థుల వివరాలు ఒకే కార్డులో భద్రపర్చనున్నారు. దీంతో స్థానికంగానే కాకుండా దేశ విదేశాల్లో కూడా విద్యనభ్యసించడం ఇక నుంచి సులభతరం కానుంది. ఈ విధానంలో పిల్లల సంపూర్ణ విద్యా ప్రగతి తల్లిదండ్రులకు తెలిసే అవకాశం కూడా ఏర్పడుతుంది.

అన్ని యాజమాన్య పాఠశాలలకు...

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి అపార్ (ఆటోమేటిక్ పర్మనెంట్ అకౌంట్ రిజిస్ట్రీ) చేయించుకోవాలి. దేశంలోని విద్యార్థులందరికి ప్రత్యేకంగా రూపొందించిన 12 అంకెల గుర్తింపు వ్యవస్థనే 'అపార్'గా చెబుతున్నారు. ఇప్పటికే ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ ద్వారా ప్రతి విద్యార్థి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్(పెన్) కేటాయించారు. ప్రస్తుతం పెన్ ఆధారంగానే విద్యార్థులకు అడ్మిసన్లు, రికార్డు షీట్లు, టీసీలు జారీ చేస్తున్నారు.

మేనేజ్‌మెంట్ వారీగా 9,10వ తరగతి విద్యార్థుల వివరాలు ఇలా...

మేనేజ్‌మెంట్	స్కూళ్ల సంఖ్య	9వ తరగతి	10వ తరగతి	మొత్తం
ఎయిడెడ్	18	694	660	1354
గవర్నమెంట్	282	14391	14396	28787
ప్రైవేటు	333	15330	14553	29883
మొత్తం	633	30415	29609	60024

విద్యార్థి పురోగతి సులభంగా...

ఎప్పటికప్పుడు విద్యార్థుల అకడమిక్ పురోగతిని తెలుసుకోవడానికి, విద్యను మరింత సమర్థంగా నిర్వహించడానికి అపార్ ఐడి ఉపకరించనుంది. జాతీయ విద్యా విధానం -2020 ప్రకారం ప్రత్యేక ఐడీని రూపొందిస్తున్నారు. అలాగే డిజిటలైజేషన్, పర్సనలైజ్డ్ లెర్నింగ్, బడిబయట లేదా చదువుకు దూరంగా ఉన్న విద్యార్థులను తిరిగి పాఠశాలలకు చేర్పించడం ద్వారా విద్యను సార్వత్రికం చేయడం దీని ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. దీని ద్వారా ప్రతి విద్యార్థి ఆయా విద్యా సంస్థల్లో సాధించిన విషయాలు, అతడి అకడమిక్ హిస్టరీ, డిజిలాకర్ ఇంటిగ్రేషన్ ద్వారా తీసుకున్న కోర్సులు, గ్రేడ్లు, సర్టిఫికెషన్లు ఇలా ప్రతి విషయాన్ని శాశ్వతంగా రికార్డు చేయడానికి అపార్ ఐడి ఉపకరిస్తుంది. దీని ద్వారా విద్యార్థులు వారి అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా యాక్సెస్ చేసుకోవచ్చు. అలాగే విద్యా సంస్థల మధ్య సులభతరంగా బదిలీ చేసుకునే వీలుంటుంది. ఉద్యోగాలు, ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థుల అకడమిక్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యే వీలుంటుంది.

జిల్లాలో పరిస్థితి...

ప్రతి విద్యార్థికి జిల్లాలో అపార్ ఐడిని రూపొందించేందుకు విద్యాశాఖ అడుగులు వేస్తోంది. మందుగా జిల్లాలో ఉన్న 635 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పరిధిలో 9, 10 తరగతులు చదువుతున్న 60,024 మంది విద్యార్థులకు అపార్‌ఐడిని ఆయా విద్యాసంస్థల ద్వారా క్రియేట్ చేయనున్నారు. ఇందుకుగాను ముందుగా అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అనంతరం ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది, అనంతరం విద్యార్థుల తల్లితండ్రులు/ సంరక్షకులకు అనుమతి పత్రాలను సిద్ధం చేసుకుని ఆ తర్వాత ప్రతి విద్యార్థికి అపార్ ఐడిని క్రియేట్ చేయనున్నారు.

తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి...

విద్యార్థుల అకడమిక్ డేటా భద్రంగా ఉంచేందుకు, గోప్యత పాటించేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. అపార్ ఐడి వివరాలను అధీకృత వినియోగదారుల ద్వారా మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రతా చర్యలను తీసుకుంటారు. 18 ఏళ్లలోపు పిల్లల అపార్ ఐడీ జనరేషన్‌కు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అనుమతితోనే క్రియేట్ చేస్తారు. అపార్ ఐడీ జనరేట్ చేసేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన అంగీకార పత్రాన్ని పాఠశాలలో భద్రపరుస్తారు. ఆధార్ నంబర్ ఆధారంగా అపార్ ఐడీని క్రియేట్ చేస్తారు.

ముందుగా అవగాహన...



ఆధార్‌నెంబర్ మాదిరిగానే ప్రతి విద్యార్థికి అపార్ ఐడిని కేటాయించాల్సింది ఉంది. ఈ విషయమై ఇటీవలే వెబెక్స్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు తెలియజేశాం. తొలుత అపార్ ఐడీపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తాం. విద్యార్థుల తల్లిదండ్రుల/సంరక్షకుల నుంచి వారి అంగీకారం పత్రాలను తీసుకున్న తర్వాత ఐడీలు క్రియేట్ చేసేందుకు చర్యలు చేపడతాం. ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అందజేసేందుకు అసవరమైన చర్యలు చేపడతాం. - మర్రెడ్డి అనూరాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

భద్రతా ప్రమాణాలను పాటించాలి

కడప సెవెన్‌రోడ్స్: పర్యావరణానికి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పైప్‌లైన్, కేబుల్ నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జేసీ అదితి సింగ్‌తో కలిసి హెచ్‌పీసీఎల్, పైప్‌లైన్, కేబుల్ నిర్మాణ ప్రక్రియలో భాగస్వామ్యం వహించే అనుబంధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ- ధర్మపురి పైప్‌లైన్ నిర్మాణం వైఎస్సార్‌జిల్లా మీదుగా వెళుతోందన్నారు. ప్రతి 30-40 కిలో మీటర్ల మధ్యలో ఒక వాల్వ్ ను ఏర్పాటు చేస్తామని.. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో మొత్తం 697 కిలో మీటర్ల మేర పైప్ లైన్ నిర్మిస్తామన్నారు. మన రాష్ట్రంలో 619 కి.మీ., తమిళనాడు రాష్ట్రంలో 78 కి.మీ. మేర పైప్ లైన్ నిర్మిస్తున్నారని.. కడప జిల్లాలోనే 140 కిలో మీటర్లు జియో ఫినిషింగ్ ద్వారా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నిర్మాణం కోసం జిల్లాలోని ఆయా మండలాల్లో అన్ని రకాల అనుమతులను తీసుకోవడంతోపాటు హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణం కోసం అన్ని రకాల భద్రతా చర్యలను చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అలాగే ఏపీ ఫైబర్ నెట్ ఎయిర్ ఫైబర్ కేబుల్ నిర్మాణం జిల్లాలో 2400 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్నామని, ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయన్నారు. అంతకుముందు హెచ్‌పీసీఎల్ అధికారులు పైప్‌లైన్ నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను పీపీటీ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్, నేషనల్ హైవేస్, ఏపీ ఫైబర్, ఎన్విరాన్‌మెంట్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూఎస్ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఇస్రో స్పేస్ వీక్



బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రెండవరోజు కేఎస్ఆర్ఎం, ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన వరల్డ్ స్పేస్ వీక్–2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్పేస్ వెదర్ ఛేంజ్ థీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 36 మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలకు డీఈఓ మర్రెడ్డి అనురాధ, నోడల్ ఆఫీసర్ టి.వి. రమణయ్య, ఇస్రో జనరల్ మేనేజర్ బాలమురళి, ఎస్‌డీఏసీ శార్, ఎస్. డిప్యూటీ జనరల్ మేనేజర్ రెడ్డెయ్యల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ వీర శంకర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సురేష్ బాబు, ఈసీఈ డిపార్ట్ మెంట్ కో ఆర్డినేటర్ ఎం. ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కమలాకర్

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కమలాకర్‌ను నియమించారు. విశాఖపట్టణంలోని కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కమలాకర్‌ను కడపకు బదిలీ చేశారు. ఆయన నేడో, రేపో బాధ్యతలను స్వీకరిస్తారు. కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జవహర్ బాబును రాజమండ్రిలోని కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు.

213 అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

లింగాల : లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో రూరల్ సీఐ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో లింగాల పోలీసులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ప్రభాకర్‌రెడ్డి, శివారెడ్డి అనే వ్యక్తులు అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వారిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న 213 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎన్వీ రమణ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కేజీబీవీల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఏపీ సమగ్రశిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతన సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ, కేజీబీవీల జీసీడీఓ విజయలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందులో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ హ్యాబిటేషన్ పరిధిలో నివాసం ఉండాలని తెలిపారు. అలాగే హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదన్నారు. డే/నైట్ వాచ్ మెన్, చౌకీదార్ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు apkfbv.apcfrr.in webriteతో వెబ్ సైట్‌ను చూడాలని సూచించారు.

ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలు వెలకట్టలేనివి

- ఆయన సేవలకు గుర్తుగానే జిల్లాకు వైఎస్సార్ జిల్లాగా నామకరణం
- జిల్లా పేరు మారిస్తే వైఎస్సార్‌సీపీతో పాటు ప్రజలు ఉద్యమిస్తారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగానే కాకుండా ప్రతిపక్ష నేతగా ఉమ్మడి రాష్ట్రానికి అందించిన సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జిల్లా పేరును మార్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం కడపలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ మరణానంతరం ఆయన సేవలకు గుర్తుగా 2010లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకు వైఎస్సార్ జిల్లాగా నామకరణం చేసిందన్నారు. దీంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య నెల్లూరు జిల్లాను పొట్టి శ్రీరాములు జిల్లాగా మార్చారన్నారు. తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు జిల్లాలకు ఆయా జిల్లాల్లో ఆ నాయకులు చేసిన సేవలకు గుర్తుగా పేర్లు పెట్టారన్నారు. మంత్రి సత్యకుమార్ మాటలకు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వంతపాడటం సరికాదన్నారు. దేవగుడి కుటుంబానికి దివంగత వైఎస్సార్ ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. మేలు చేసిన వారి పట్ల తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. జిల్లాకు మేలు చేయకూడదనే ఉద్దేశంతోనే సత్యకుమార్‌కు మంత్రి పదవి ఇచ్చారేమోనని అనిపిస్తోందన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు కేంద్రం 50 సీట్లు కేటాయిస్తే మాకు వద్దని లేఖ రాసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్ పాకా సురేష్, బాలస్వామిరెడ్డి, యూత్ నాయకుడు దేవిరెడ్డి ఆదిత్య పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్చమనడానికి సత్యకుమార్‌కు ఏ అర్హత ఉంది ?

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లా పేరును మార్చమనడానికి మంత్రి సత్య కుమార్‌కు ఏం అర్హత ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధర్మవరం ఎమ్మెల్యే అయిన సత్య ఆ నియోజకవర్గం గురించి, ఆ జిల్లా గురించి చూసుకోవాలే తప్పా..తమ జిల్లాతో ఏం పని అని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఐదేళ్ల రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి ఈ జిల్లాకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని, ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాది మందికి ప్రాణదాత అయ్యారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆ పథకాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని అనేక సార్లు చెప్పారని గుర్తు చేశారు. ఎంతో వెనుకబడిన రాయలసీమకు, కడప జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలంగాణ నేతలకు ఎదురొడ్డి నిలిచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచారన్నారు. ఈ జిల్లా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం వైఎస్సారేనని, ఆయన పేరును ఈ జిల్లాకు పెట్టాలని రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేలంతా లేఖ ఇచ్చారని, ఆదినారాయణరెడ్డి కూడా అందులో ఉన్నారని వివరించారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు తన కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్ గురించి ఆదినారాయణరెడ్డి మాట్లాడటం విచారకరమన్నారు. ఊరు విడిచే స్థితిలో ఉన్న ఆదినారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, వారి సోదరుడు నారాయణరెడ్డిని ఎమ్మెల్సీలుగా చేసింది వైఎస్సారేనన్నారు. ఇప్పుడు కూడా ఆది బీజేపీలో ఉంటే, ఆయన అన్న నారాయణరెడ్డి టీడీపీలో ఉన్నారన్నారు. వీరా వైఎస్సార్ గురించి మాట్లాడేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్ కోట్లాదిమంది హృదయాల్లో కొలువై ఉన్నారని, జిల్లా పేరు మారిస్తే ఈ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదపై ఎస్పీకి ఫిర్యాదు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డితో పాటు ఆయన వర్గీయులతో తనకు ప్రాణహాని ఉందని పట్టణానికి చెందిన చెంగా మదన్ మోహన్ జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదే ఫిర్యాదు ఆధారంగా తనపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని మంగళవారం త్రీటౌన్ పోలీసులను కలిశారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెంగా మదన్ మోహన్ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అలాగే చెన్నైకి చెందిన హిజా ప్రైవేట్ లిమిటెడ్‌లో పెట్టుబడులు పెట్టడంతోపాటు మరికొందరితో పెట్టించాడు. కంపెనీ నెలకు రూ.లక్షకు 15 శాతం వడ్డీ ఇస్తుందన్న ఆశతో మరికొందరు డబ్బు చెల్లించారు. ఖాజీపేట మండలం రంగాపురం గ్రామానికి చెందిన కొర్రకూటి ఆదినరసింహులు భార్య ఈశ్వరమ్మ ఇదే కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. చెంగా మదన్ మోహన్ ద్వారానే తాము పెట్టుబడులు పెట్టి నష్టపోయామని వారు గతంలో మైదుకూరు డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును కొట్టివేశారు. కాగా కొద్ది రోజులుగా ప్రొద్దుటూరుకు చెందిన నందలూరు నవీన్ కుమార్‌రెడ్డి చెంగా మదన్ మోహన్‌కు ఫోన్ చేస్తున్నాడు. ఎల్ఐసీ పాలసీ చేస్తామని చెప్పి గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్దకు రమ్మన్నాడు. అక్కడి నుంచి మదన్ మోహన్‌ను నెహ్రూ రోడ్డులోని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కార్యాలయానికి తీసుకెళ్లాడు. అక్కడ నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు మరో పది మంది మదన్‌మోహన్‌పై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సైతం మదన్ మోహన్‌పై దాడి చేసి ఖాళీ బాండు పేపర్‌పై సంతకం చేయమని బెదిరించారు. అలా చేయకపోతే రేప్ కేసు పెట్టి జైలు నుంచి బయటికి రాకుండా చేస్తానని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సంఘటనపై గత నెల 25న చెంగా మదన్ మోహన్ స్వయంగా జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డిని వివరణ కోరగా చెంగా మదన్ మోహన్ ఫిర్యాదులో వాస్తవం లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెంకటప్ప పాఠశాల విద్యార్థులు



ప్రశంసా పత్రం అందుకున్న వై.యశస్విని, కె.భార్గవి

పులివెందుల టౌన్ : ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ అండర్ 14, 16, 20 విభాగాలలో పులివెందులకు చెందిన వెంకటప్ప మెమోరియల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో అండర్–20లో కె.భార్గవి, 1600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, అండర్–14లో కిడ్స్ జావెలిన్ త్రోలో వై.యశస్విని, జావెలిన్ త్రోలో సి.అంజలి, డిస్కస్ త్రోలో కె.తబిత, సాఫ్ట్‌బాల్ పోటీలో వై.బద్రీనాథ్ జాతీయ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 17వ తేదీన గుంటూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైఎస్సార్ ఫౌండేషన్ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి బి.ఆర్.విజయభాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ సారా, పీఈటీ వెంకట ప్రభావతిలు అభినందించారు.

తెలుగు గంగ కాలువలో దిగి బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు సుజిత్

మైదుకూరు : తోడుగా వచ్చిన స్నేహితులు ఈత కొడుతుంటే తాను కూడా ఈత కొట్టాలనే ఉబలాటంతో తెలుగు గంగ కాలువలోకి దిగి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మైదుకూరు మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని విశ్వనాథపురం ఎస్సీ కాలనీకి చెందిన కొందరు పిల్లలు సమీపంలోని తెలుగు గంగ కాలువ వద్దకు వెళ్లారు. వారిలో సుజిత్ (14) అనే బాలుడు ఒడ్డున ఉండగా మిగిలిన వారు కాలువలో దిగి ఈత కొడుతున్నారు. ఈత కొడుతున్న వారిని చూసి తాను కూడా ఈత కొట్టాలనే ఉత్సాహంతో సుజిత్ కాలువలోకి దిగాడు. ఈత రాకపోవడంతో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అది గమనించిన మిగిలిన వారు గ్రామానికి చేరుకుని బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు బాలుడి కోసం గాలించగా కొంత దూరంలోని గేట్ల వద్ద శవమై బాలుడు కనిపించాడు. దాంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఎస్సీ కాలనీలో విషాదం అలుముకుంది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్

సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫక్రుద్దీన్


రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాధిత మహిళలకు కడపలోని వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని రిమ్స్ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు ఈ కేంద్రాన్ని ఆశ్రయించవచ్చని వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబర్ 15100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిటోరియం దుస్థితిపై రిమ్స్ ప్రిన్సిపల్ స్పందన

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో ఉన్న ఆడిటోరియం పరిస్థితిపై సెప్టెంబర్ 30న సాక్షిదినపత్రికలో 'ఆసుపత్రికి అనారోగ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మంగళవారం స్పందించారు. ఆడిటోరియంలో కొన్ని మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. దీనికోసం విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఏపీఎంఎస్ఐడీసీ వారికి విన్నవించామన్నారు. సంబంధిత పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

విశాఖ జట్టు విజయభేరి


వినోద్, విశాఖ (177 పరుగులు)


రామ్‌చరణ్, విశాఖ (133 పరుగులు)


ప్రఖ్యాత్‌వర్మ, విశాఖ (5 వికెట్లు)


సాయికృష్ణ చైతన్య, కడప, (147 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–14 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు విజయభేరి మోగించగా, ప్రకాశం, చిత్తూరు జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 112 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు రెండోరోజు మంగళవారం 68 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని రామ్‌చరణ్ 133 పరుగులు, వినోద్ 177 పరుగులతో రాణించారు. పశ్చిమగోదావరి బౌలర్ మణివర్ధన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు 34 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌట్ అయింది. విశాఖ బౌలర్లు ప్రఖ్యాత్ వర్మ 5 వికెట్లు, వినోద్ 2 వికెట్లు తీశారు. కాగా తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టు ఇన్నింగ్స్ 117 పరుగుల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది.

ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండోరోజు మంగళవారం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని సాయికృష్ణ చైతన్య 147 పరుగులు, హితేష్‌సాయి 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ప్రకాశం బౌలర్లు దినేష్ 3, లోకేష్ 3 వికెట్లు తీశారు. కాగా ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 405 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చిత్తూరు జట్టుకు ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 132 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని శ్రీవంత్‌రెడ్డి 52, తనీశ్వర్ టెండూల్కర్ 54 పరుగులు, మణిదీప్ 72 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమగోదావరి జట్టు 120 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ఏడేళ్ల తర్వాత కుమారుడు తల్లిదండ్రులకు అప్పగింత

– ఆధార్ కేంద్రంలో వేలిముద్రల ద్వారా గుర్తింపు


రిత్వాన్‌ను తండ్రి దుర్గాదాస్‌కు అప్పగించిన కడప ప్రభుత్వ బాలుర గృహం సూపరింటెండెంట్

కడప అర్బన్ : అదృశ్యమైన కుమారుడిని ఏడేళ్ల తరువాత తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన కడప నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రభుత్వ బాలుర గృహంలో ఉంటున్న మహారాష్ట్రలోని ముంబయికి చెందిన యువకుడు రిత్వాన్ (16)ను అతని తండ్రి దుర్గాదాస్‌కు సూపరింటెండెంట్ వీరయ్య, తమ సిబ్బందితో కలిసి అప్పగించారు. ఈ సందర్భంగా వీరయ్య వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలుడు రిత్వాన్ 8 ఏళ్ల వయసులో ముంబయి నుంచి 2018లో అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి వివిధ ప్రాంతాలు తిరుగుతూ కర్నూలుకు వచ్చాడు. ఈ క్రమంలో 2022లో కడపలోని ప్రభుత్వ బాలుర గృహానికి పంపించారు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్నాడు. ఇటీవల ఆ బాలుడికి ఆధార్ కార్డును తయారు చేయించాలని సూపరింటెండెంట్ పర్యవేక్షణలో సిబ్బంది ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డు కోసం బాలుడి చేతి వేళ్లను ముద్రించే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఆధార్ కార్డు ఉందని గమనించారు. అతని తల్లిదండ్రుల వివరాలను తెలుసుకుని వారికి సమాచారం ఇచ్చారు. వారు రాగానే బాలుడిని అప్పగించారు.

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై.. యువకుడి ఆత్మహత్య


కార్తీక్ (ఫైల్)

చక్రాయపేట : మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండాకు చెందిన ఇస్లావత్ కార్తీక్ (19) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. మృతుడి తండ్రి ఇస్లావత్ క్రిష్టా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కార్తీక్ పాలిటెక్నిక్ ఫెయిల్ అయ్యాడు. అయితే ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ ఇటీవల కొంత డబ్బు పోగొట్టుకున్న విషయం తెలిసి తల్లిదండ్రులు మందలించారు. మంగళవారం కార్తీక్ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బు విత్‌డ్రా చేసుకొచ్చి ఇవ్వాలని తండ్రి క్రిష్టానాయక్ చెప్పడంతో సరే అని చెప్పి వెళ్లిన కార్తీక్ గ్రామ సమీపంలోని అడవిలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత..


ఆత్మహత్య చేసుకున్న గంగా సుమతి

చక్రాయపేట : మండలంలోని అద్దాలమర్రిలో తోళ్లపల్లె గంగాసుమతి (19) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. మృతురాలి సోదరుడు జరిపిటి గురుభాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అద్దాలమర్రికి చెందిన గంగా సుమతిని శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన తోళ్లపల్లె ప్రశాంత్‌కు ఇచ్చి ఈ ఏడాది ఏప్రిల్ 12న వివాహం జరిపించారు. పెళ్లి అయినప్పటి నుంచి భర్త, అత్త వేధింపులు అధికమయ్యాయి. దీంతో ఆమె అద్దాలమర్రిలోని పుట్టింటికి వచ్చింది. భర్త, అత్త ఇద్దరూ ఫోన్ చేసి ఆమె ఆత్మహత్య చేసుకొనే విధంగా ప్రేరేపించడంతో దిక్కు తోచక ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చక్రాయపేట తహసీల్దార్ విజయకుమారి శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూలు విడుదల

ఈనెల 14 నుంచి 21 వరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహణ

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్ఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూలును డీఈఓ ఎం. అనూరాధ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి విడుదల చేశారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అండర్–14, అండర్–17 బాల బాలికల విభాగాల్లో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దిగువ తెలిపిన కేంద్రాల్లో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపికల్లో క్రీడాకారులు పాల్గొనేలా వ్యాయామ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
14-10-24	స్కేటింగ్	డీఎస్ఏ స్కేటింగ్ రింక్, కడప
15-10-24	వాలీబాల్	డీఎస్ఏ స్టేడియం, కడప
15-10-24	బ్యాడ్మింటన్	డీఎస్ఏ స్టేడియం, కడప
15-10-24	చదరంగం	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
15-10-24	వెయిట్ లిఫ్టింగ్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
15-10-24	పవర్ లిఫ్టింగ్	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
16-10-24	సాఫ్ట్‌టెన్నిస్	డీఎస్ఏ స్టేడియం, కడప
16-10-24	కబడ్డీ	డీఎస్ఏ స్టేడియం, కడప
16-10-24	క్రికెట్	డీఎస్ఏ స్టేడియం, కడప
16-10-24	ఉషు	మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్, కడప
17-10-24	ఖోఖో	ఎస్.వి. హైస్కూల్, బయనపల్లి, సీకే దిన్నె
17-10-24	రగ్బీ	డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, అడపూర్, నందలూరు
18-10-24	హాకీ	వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప
18-10-24	నెట్‌బాల్	జెడ్పీ హైస్కూల్, రామసపల్లి, చెన్నూరు
18-1024	రోల్‌బాల్	ఆర్‌సీపీఈ కళాశాల, ప్రొద్దుటూరు
18-10-24	క్యారమ్స్	జెడ్పీ హైస్కూల్, నందలూరు
19-10-24	సైక్లింగ్	కేంద్రీయ విద్యాలయ, కడప
19-10-24	రోప్ స్కిప్పింగ్	జార్జిక్లబ్, ప్రొద్దుటూరు
19-10-24	యోగ	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
21-10-24	టెన్నిస్	డీఎస్ఏ టెన్నిస్ కోర్ట్, కడప

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం ॥ 9-10-2024

ప్రమాదాల సముద్రం మీద 8 నెలల పాటు ప్రపంచ దేశాలు తిరిగి రావడానికి ఇద్దరు సాహస నేవీ మహిళా అధికారులు దిల్నా, రూపా అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరారు. కేవలం వారిద్దరు మాత్రమే ఉండే ఈ సాహసభరిత యాత్రలో వారు తోడు తీసుకెళుతున్నవి ఏమిటి? వారికి తోడుండేవి ఏమిటి? ఇంత సాహసం చేసే వీరిని చూస్తే ప్రతి అమ్మాయిలోనూ కలగదా సముద్రమంత సాహస భావన!


రూప దిల్నా

● శక్తి

ఆటుపోట్లకు వెరవని 'షి'జర్నీ

'గమ్యం ఎలాగూ ముఖ్యమే. కాని ప్రయాణం కూడా ముఖ్యం. ఈ యాత్రలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించండి' అని అక్టోబర్ 2న గోవాలో జెండా ఊపి భవిష్యత్ చరిత్రలో చిరస్థాయిగా నిలబడనున్న 'నావికా సాగర్ పరిక్రమ–2'ను ప్రారంభించారు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి. కేవలం ఇద్దరు మహిళా నేవీ ఆఫీసర్లు ఐఎన్ఎస్‌వి తారిణి పేరున్న సెయిల్ బోట్‌లో ఎనిమిది నెలల పాటు చేయనున్న ఈ సాహసయాత్ర విజయవంతం కావాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు.

ఐదు అంచెల యాత్ర

యాభై ఆరు అడుగుల పొడవుండే సెయిల్ బోట్ తారిణిలో కమాండర్లు దిల్నా, రూప ఒకరికి ఒకరు తోడుగా నిలిచి మొత్తం 23000 నాటికల్ మైళ్లు అంటే 40000 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరిన వీరు ఈ యాత్రను ఐదు భాగాలుగా చేస్తారు.

1. గోవా నుంచి ఆస్ట్రేలియా 2.ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్ 3. న్యూజిల్యాండ్ నుంచి ఫాక్‌ల్యాండ్ ఐలాండ్స్ (దక్షిణ పసిఫిక్ సముద్రం) 4.ఫాక్‌ల్యాండ్ నుంచి సౌత్ ఆఫ్రికా 5. సౌత్ ఆఫ్రికా నుంచి గోవా. భారతీయ మహిళలు అత్యంత శక్తిమంతులని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు సాగుతున్న ఈ యాత్ర కోసం తరిణికి సారథిగా లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.కే వ్యవహరిస్తుండగా.. మరో లెఫ్టినెంట్ కమాండర్ రూపా సారథ్యం వహిస్తున్నారు.

మైక్రోప్లాస్టిక్స్‌పై పరిశోధన

'నావికా సాగర్ పరిక్రమ–2' మన స్త్రీ శక్తిని నిరూపించడానికే కాదు 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ'తో అనుసంధానమై సముద్ర జలాల్లోని మైక్రోప్లాస్టిక్స్‌ను అధ్యయనం చేయడానికి కూడా ఉపయోగపడనుంది. అలాగే 'వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'తో కలిసి సముద్రాలలోని పుష్పపత్రాలు, భారీ సముద్ర జీవులపై కూడా పరిశోధనకు అవసరమైన సమాచారం కూడా సేకరిస్తారు. వీటన్నింటికి వీలుగా 'తారిణి'ని సిద్ధం చేశారు. ఈ బోట్ ముందు భాగంలో మాస్ట్‌సెయిల్స్ ఉంటాయి. వెనుక భాగంలో రెండు స్టీరింగ్ వీల్స్, ఆటో పైలట్ సిస్టమ్, నెలకు 20 జీబీ వినియోగించుకునే సౌకర్యంతో కూడిన శాటిలైట్ యాంటెన్నా ఉంటుంది. సముద్ర జలాల్ని శుద్ధి చేసి గంటకు 30 లీటర్లు మంచినీరు ఇవ్వగల ఆర్‌వో ప్లాంట్ అమర్చారు. అవసరమైన సందర్భాల్లో వినియోగించుకునేందుకు 22 తాళ్లను అందుబాటులో ఉంచారు. ల్యాప్‌టాప్‌లు, మ్యూజిక్ సిస్టం సైతం బోట్‌లో ఉన్నాయి.

బోట్ తయారీలో అధికభాగం ఫైబర్ గ్లాస్‌ను ఉపయోగించారు. వీరి యాత్రను జీపీఎస్ విధానం ద్వారా ట్రాక్ చేస్తూ ప్రయాణం ఎలా సాగుతోందో భారత నౌకాదళం నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది.

సోదరి ఇచ్చిన పాండా బొమ్మతో

'ప్రయాణం చేయడానికి భయం లేదని చెప్పడం లేదు. కానీ అంతకుమించిన ఆత్మవిశ్వాసం కూడా ఉంది. ఈ ప్రయాణంలో నాకు తోడుగా ఉంటుందని నా సోదరి పాన్‌పాన్ అని పిలుచుకునే పాండా బొమ్మ ఇచ్చింది. దీంతో పాటు ఖగోళశాస్త్రవేత్త కార్ల్‌సాగన్ రచించిన పుస్తకాలు తోడు తీసుకెళ్తున్నాను' అంది లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఈ సందర్భంగా.

అమ్మ చేసిన ఊరగాయలతో

'సముద్రం ఒక గొప్ప గురువు. మాకు సహనాన్ని నేర్పిస్తుంది. బోట్‌ను మనం మంచిగా చూసుకుంటే, అది మనల్ని మంచిగా చూసుకుంటుందనే సూత్రాన్నే పాటిస్తాను. తరిణిలో మేమే ఇంజినీర్లం, ఎలక్ట్రీషియన్లం, కార్పెంటర్లం. వాతావరణ నివేదికల్ని అనుసరిస్తూ ప్రయాణం సాగించాలి. ఎనిమిది నెలల పాటు తరిణిలోనే మా నివాసం కాబట్టి పుస్తకాలు తెచ్చుకున్నా. కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ ఇచ్చిన గిఫ్ట్స్, సంగీత వాద్య పరికరాలతోపాటు అమ్మ చేసిన ఊరగాయలు, కాలికట్ చిప్స్, టాపియోకా చిప్స్ తీసుకెళ్తున్నా. ఈ ప్రయాణం మొత్తానికి సరిపడా దోశల పిండి కూడా మా వెంట తీసుకువెళుతున్నాం. డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబొరేటరీ రూపొందించిన ప్రత్యేకమైన ఆహారాన్ని మాకు అందుబాటులో ఉంచారు' అని తెలిపింది లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.

వీరి యాత్ర సఫలం కావాలని కోరుకుందాం.

– కరుకోల గోపీకిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం

"ఇది నవరాత్రుల పవిత్ర సమయం. ప్రజలు దుర్గాదేవి పట్ల భక్తితో వివిధ మార్గాల్లో కలిసి మెలిసి పూజలు జరుపుకుంటున్నారు. ఈ సంతోషంతో ఆమె దయకు పరవశుడనై రాసిన 'ఆవతికలాయ్' అనే గర్బా గేయాన్ని ఇక్కడ ఉంచాను. ఆమె ఆశీస్సులు మనపై ఎప్పుడూ ఉండాలి" అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాయని పూర్వామంత్రి పాడిన ఈ గేయం గర్బా నృత్యానికి ఉన్న ప్రాధాన్యత తెలుసుకునేలా చేయడంతో పాటు ప్రతి మదిని ఆధ్యాత్మిక సౌరభమై తాకుతోంది. సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది.



● భక్తి

ఆటా పాటగ మారిన స్త్రీశక్తి


గర్బా నృత్యం

గర్బా నృత్యం అనగానే సంప్రదాయదుస్తులు ధరించిన సమూహాలు, ఆనందంగా నృత్యం చేస్తున్న దృశ్యాలు మన కళ్లముందు మెదలుతాయి. ఆధ్యాత్మిక బలానికి మానసికోల్లాసాన్ని కలిపి జరుపుకునే ఈ వేడుక మొదట గుజరాతీ గ్రామాలలో పుట్టి, దేశ ఎల్లలు దాటి నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

చిల్లులు గల మట్టి కుండలో దీపం వెలిగించి, తలపైన పెట్టుకుని అమ్మవారి విగ్రహం చుట్టూ వలయాకారంగా తిరుగుతూ భక్తి పారవశ్యంలో నృత్యం చేస్తారు. మట్టికుండ తల్లి గర్భాన్ని, జ్యోతి నుండి వెలువడే కాంతి లోపల పెరుగుతున్న కొత్త జీవిని సూచిస్తుంది. భక్తుల కోసం రాక్షసుడితో పోరాడిన దేవత పట్ల తమ ప్రేమ, కృతజ్ఞతలను ఈ నృత్యం ద్వారా తెలియజేస్తారు. మనలో ఉన్న అన్ని చెడులను నాశనం చేయడానికి, లోపల ఉన్న శక్తిని మేల్కొలిపే విధానంగా కూడా గర్బా నృత్యాన్ని చెబుతారు. గర్బా నృత్య రూపం స్త్రీత్వం, సంతానోత్పత్తిని తెలియజేస్తుంది. ఇందులో భజనలు, కీర్తనలకు చోటు ఎక్కువ. ఎక్కువ భక్తి ఆకర్షణను కలిగి ఉండే గర్బాను అమ్మవారి హారతికి ముందు నిర్వహిస్తారు.

కాలచక్రం .. పునరావృతం

దేవీ ఆరాధనలో భాగంగా చెప్పుకునే ఈ నృత్యాన్ని స్త్రీ–పురుషులు ఇద్దరూ తొమ్మిది రాత్రులు చేస్తారు. చాలా మంది ఈ తొమ్మిది రోజులూ కొన్ని ప్రత్యేక ఆహార నియమాలు, ఉపవాసాలు పాటిస్తారు. కాలచక్రం ఎప్పుడూ తిరుగుతూ పునరావృతం అవుతుంది. పుట్టుక నుంచి మరణం వరకు, మరణం నుంచి పునర్జన్మ వరకు ఆత్మ తిరుగుతూ ఉంటుంది. ఈ అన్ని అంశాల్లోనూ కదలకుండా నిరంతరాయంగా ఉండేది దైవశక్తి ఒకటే. దానికి ప్రతీకగా నృత్య వలయం మధ్య దేవీ ప్రతిమ లేదా పెద్ద దీపపు సెమ్మెను పెడతారు. జీవన చక్రం దాని చుట్టూనే పరిభ్రమిస్తుంటుందని చెప్పేందుకు ఇదొక ప్రతీక.

మహిషుని అంతం చేసిన మహిళా శక్తి

ఒక్క స్త్రీ చేతిలో తప్ప మరెవరి చేతిలోనూ మరణించకుండా ఉండాలన్న వరబలంతో మహిషాసురుడు తన శక్తులను చెడు కోసం ఉపయోగించడం ప్రారంభించాడు. అతడి దాడికి దేవతలు నిస్సహాయలైపోయారు. దుర్గాదేవి వద్దకు వెళ్లి, వేడుకున్నారు. దుర్గాదేవి ఒక్క కంటిచూపుతో ఆ రాక్షసుని అంతం చేయగలదు. కానీ, అసుర సంహారానికి ముందు తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రుల పాటు సాగిన సర్వోన్నతమైన యుద్ధం ద్వారా మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. అసాంఘిక, అధార్మిక శక్తులు ఎంత బలంగా కనిపించినా, యుద్ధం ఎంతకాలం సాగినా, చివరికి ధర్మమే విజయం సాధిస్తుందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది. ఈ కథనాన్ని గర్బా నృత్యం ద్వారా ప్రదర్శించడం అంతర్లీనంగా కనిపిస్తుంది.

బేతే గర్బా

గుజరాత్‌లోని నాగర్ కమ్యూనిటీ 'బేతే గర్బా' అంటే కూర్చున్న గర్బా అని జరుపుకుంటారు. ఇక్కడ, భక్తులు ఒకరి ఇంటి వద్ద గుమిగూడి, గర్బా పాటలు పాడతారు. హిందువులు తమ పండుగలను బహిరంగంగా జరుపుకోవడాన్ని నిజాం నిషేధించినప్పుడు, ఇస్లామిక్ పాలనలో జునాగఢ్ లో బేతే గర్బా ప్రారంభమైంది. చాలామంది కఠినమైన ఉపవాస దీక్షలో ఉన్నప్పటికీ నృత్యం, సంగీతంతో ఉల్లాసంగా మారిపోతారు. ఉత్తర భారతదేశంలో గర్బా లో భక్తులు తబలా, మంజీరను ఉపయోగిస్తారు.

సంప్రదాయ దుస్తులతో...

ఈ నృత్యంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, శక్తి దేవత ఆశీర్వాదాలు కోరుకుంటూ నృత్యం చేస్తారు. గర్బా, దాండియా ఒకే విధంగా కనిపించినా, ఈ రెండింటికి వ్యత్యాసం ఉంది. గర్బాలో చేతులు, కాళ్లను సమన్వయంతో కదిలిస్తూ చేస్తారు. దాండియాలో కోలాటం కర్రలను ఉపయోగిస్తారు. గర్బా పాటలు దుర్గాదేవి, ఆమె అవతారాల చుట్టూ ఉంటే, దాండియాలో పాటలు కృష్ణుడి రాసలీలలపై ఉంటాయి.

పాదరక్షలు లేకుండా..

గర్బా దైవారాధనా రీతుల్లో చెప్పులు ధరించకపోవడం సకల జీవులకు ఆలవాలమైన భూదేవి పట్ల మనం చూపే గౌరవంగా భావిస్తారు. భూమిని నిరంతరం అంటి పెట్టుకుని ఉండే ఈ పాదాల ద్వారానే శరీరంలోకి శక్తి ప్రవాహం జరుగుతుందని నమ్మకం. ఆ దేవితో మనకు నేరుగా సంబంధాన్ని కల్పించేవి పాదాలే. అందుకే చెప్పులు లేకుండా చేసే ఈ నృత్యం పవిత్రమైన దైవారాధన వంటిది.

గర్బా.. యునెస్కో

నవరాత్రి ఉత్సవాలను గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాలలో నిర్వహిస్తుంటారు. మన దేశానికే ప్రత్యేకమైన ఈ ప్రముఖ నృత్యాన్ని యునెస్కో 'ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యుమానిటీ' (ఐసీహెచ్) జాబితాలో కిందటేడాది చేర్చింది. అమ్మవారి ఎదుట భక్తిని నృత్యరూపంలో చాటే ఈ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ ఎప్పటికీ సజీవమే అనడానికి ప్రతీకగా నిలుస్తోంది గర్బా.

లీగల్

ఆ రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు పెట్టచ్చు

ప్రశ్న: మేము లోన్ ద్వారా ఒక రియల్ ఎస్టేట్ సంస్థ వద్దనుంచి నిర్మాణదశలోనే ఫ్లాట్ కొన్నాము. ఒప్పందం ప్రకారం పది నెలల లోగా ఫ్లాటు మాకు పూర్తి చేసి ఇవ్వాలి. కానీ సంవత్సరం అయినా ఇంకా పూర్తి చేయలేదు. లోను నెలవారీ వాయిదాలు కట్టడం కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో మేము ఏం చేయాలి? పరిష్కారం చెప్పగలరు.

– టి.ఆర్. రాజేశ్వరి, హైదరాబాద్

సర్వసాధారణంగా రియల్ ఎస్టేట్ సంస్థ వారు, మీరు రాసుకునే ఒప్పంద పత్రం అంటే అగ్రిమెంట్‌లో సమయానికి ఫ్లాట్ నిర్మాణం పూర్తి చేసి, మీకు అందజేయకపోతే అందుకుగాను తాత్కాలిక పరిహారం/ఉపశమనం ఏం చేస్తారో రాసుకుంటారు. కొన్ని సందర్భాలలో ఫ్లాట్ అప్పగించేంతవరకు అద్దె ఇవ్వటం లేదా మీ తరఫున నెలవారీ లోను డబ్బులు సదరు కంపెనీ వారే కట్టేలా ఒప్పందాలు కూడా రాసుకుంటారు. మీ ఒప్పందపత్రంలో కూడా అటువంటి కండిషన్ ఏమైనా ఉందేమో చూసుకోండి. ఏది ఏమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మీరు సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై వినియోగదారుల రక్షణ చట్టం కింద కేసు వేయవచ్చు. మీకు జరిగిన ప్రతి నష్టాన్ని లెక్కగట్టి దానికి తోడు మీకు కలిగిన మానసిక క్షోభకి కూడా అదనంగా పరిహారం కోరవచ్చు, పొందవచ్చు. అదనంగా... ఒకవేళ మీరు కొన్న ఫ్లాట్ ప్రాజెక్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) లో రిజిస్టర్ అయి ఉంటే అదనంగా రెరాకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. మీ అగ్రిమెంటు, ఆస్తి కొనుగోలు పత్రాలు తీసుకొని దగ్గర్లోని లాయర్‌ని కలవండి.

మొదటగా ఒక నోటీసు పంపి, అప్పటికీ కూడా మీకు పరిష్కారం దొరకకపోతే, పైన తెలిపిన విధంగా దావా వేసి న్యాయం పొందవచ్చు. వినియోగదారుల చట్టం ప్రకారం మీ కేసు మీరు కూడా వాదించుకోవచ్చు లేదా మీ తరఫున మరెవరినైనా 'ఆథరైజ్డ్ పర్సన్'గా నియమించుకోవచ్చు. 50 లక్షల దావా వరకు జిల్లా వినియోగదారుల ఫోరంలో, 50 లక్షల నుంచి రెండు కోట్ల వరకు రాష్ట్ర ఫోరంలో అలాగే రెండు కోట్ల పైన విలువ గల దావాకి జాతీయ వినియోగదారుల ఫోరంలో మీ ఫిర్యాదును నమోదు చేయాల్సి ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.





దేవుడు తన రెండు కాళ్లనూ బలహీనపరిచినా.. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకుని తన జీవితాన్ని తానే నిలబెట్టుకున్నారామె. ఇప్పుడు తన లాంటి దివ్యాంగుల ఉద్ధరణకు నడుం బిగించి వారికీ బతుకుబాట చూపుతున్నారు. ఆమే డీ హబ్ వ్యవస్థాపకురాలు కొప్పుల వసుంధర. ఉన్న చోటే వారు వ్యాపారం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆమె ఇంటర్వ్యూని ఈ లింక్‌ను క్లిక్ చేసి సాక్షి @ నవశక్తిలో చూసేద్దాం.

https://www.youtube.com/watch?v=0c7--NycLyU

టెక్నాలజీ

స్వాగతం.. సుస్వాగతం



బెంగళూరులోని ఒక హోటల్‌లోకి అడుగు పెట్టిన అనన్య నారంగ్‌కు రిసెప్షనిస్ట్ స్వాగతం పలికింది.

అనన్యలో షాక్‌లాంటి ఆశ్చర్యం.

'ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది!' అనే కదా మీ డౌటు.

అయితే సదరు ఈ రిసెప్షనిస్ట్ సాధారణ రిసెప్షనిస్ట్ కాదు... వర్చువల్ రిసెప్షనిస్ట్!

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో వర్చువల్ రిసెప్షనిస్ట్' వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మన దేశంలో నవీన సాంకేతికత గురించి వివరంగా మాట్లాడుకునేలా చేస్తోంది.

'సాంకేతికత సహాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులను ఏకకాలంలో సమన్వయం చేస్తున్నారు. సిలికాన్ వ్యాలీలో తప్ప మన దేశంలో ఎక్కడా ఇలాంటి దృశ్యం కనిపించదు' అంటూ ఈ 'వర్చువల్ రిసెప్షనిస్ట్' ఫొటోని షేర్ చేసింది అనన్య.

'ఎంత సాంకేతిక ప్రగతి' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా... 'అబ్బేబ్బే! ఇదేం ప్రగతి. అందమైన మానవ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి, వర్చువల్ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి చా...లా తేడా ఉంటుంది' అనే వాళ్లే ఎక్కువ!

● చిన్నారులపై జచింత

నెత్తుటేరుల అవార్డ్ నాకొద్దు


జసింతా కెర్కెట్టా

తన ఆదివాసీల సామాజిక, సాంస్కృతిక జీవితం గురించి లోతుగా రాయడమే కాదు పిల్లల ప్రపంచం గురించి కూడా రాస్తోంది కవయిత్రి జసింతా కెర్కెట్టా.

ఎక్కడ చూస్తే అక్కడ వారై – విశ్వరూపమున విహరిస్తున్న ఈ కాలంలో పిల్లల కోసం జసింత రాసిన 'జిర్హుల్' అనే పుస్తకానికి 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్–2024' అవార్డ్ ప్రకటించారు. పాలస్తీనాలో బాంబు దాడుల్లో మరణించిన, హింసకు గురవుతున్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఈ అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.

'రూమ్ టు రీడ్ ఇండియా' అనేది అక్షరాస్యత, లింగ సమానత్వం... మొదలైన వాటిపై పనిచేసే స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థకు ఏరోస్పేస్ దిగ్గజం 'బోయింగ్'తో సంబంధం ఉంది అని ఆరోపిస్తూ తనకు ప్రకటించిన అవార్డ్‌ను జసింత కెర్కెట్టా తిరస్కరించింది. 'బోయింగ్‌కు ఇజ్రాయెల్ సైన్యంతో 75 ఏళ్లుగా సంబంధం ఉంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు ఆయుధాలను సరఫరా చేసే కీలక సంస్థ అయిన బోయింగ్ 'రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్'కు నిధులు అందజేస్తుంది' అని జసింత తన తిరస్కరణ కారణాలపై ఆ ట్రస్ట్‌కు లేఖ రాసింది.

'ఆయుధాలతో పిల్లల ప్రపంచం నాశనం అవుతున్నప్పుడు ఆయుధాల వ్యాపారం, పిల్లల సంరక్షణ ఏకకాలంలో ఎలా కొనసాగుతాయి?' అని ఆ లేఖలో ప్రశ్నించింది జసింత.

'సాహిత్యంలో వైవిధ్యమైన, పిల్లల కోసం రాస్తే పుస్తకాలు తక్కువగా వస్తున్నాయి. బాల సాహిత్యానికి సంబంధించిన జిర్హుల్ పుస్తకానికి అవార్డ్ రావడం సరియైనదే అయినా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ అవార్డ్‌ను స్వీకరించలేను' అని చెప్పింది.

ఈ తిరస్కరణ మాట ఎలా ఉన్నా 'సాహిత్యానికి జసింత కెర్కెట్టా చేసిన కృషి విలువైనదిగా భావిస్తున్నాం' అని స్పందించింది 'రూమ్ టు రీడ్ ఇండియా' ట్రస్ట్. ఇప్పుడు మాత్రమే కాదు సామాజిక కారణాలతో తనకు వచ్చిన కొన్ని అవార్డ్‌లను గతంలోనూ తిరస్కరించింది జసింత.

పిల్లల్లో సామాజిక చైతన్యం

పిల్లలూ... మీరు ఎన్ని పువ్వుల గురించి విన్నారు? పూలన్నింటి గురించి తెలియనప్పుడు, కొన్ని పువ్వుల గురించి మాత్రమే తెలిసినప్పుడు... అవి మాత్రమే గొప్ప పుష్పాలూ, ప్రత్యేకమైన పుష్పాలూ ఎలా అవుతాయి? ఇవి మాత్రమే కాదు జిరాహుల్, జతంగి, సోనార్హి, సరాయ్, కోయినార్, సనాయ్ లాంటి ఎన్నో పూలు ఉన్నాయి' అంటూ పది పువ్వుల గురించి జసింత కవిత్వం రాసింది. ఈ పువ్వుల గురించి ఎప్పుడూ వినని, ఎప్పుడూ చూడని పిల్లలు కూడా జసింత రాసిన కవిత్వం చదివి, పక్కన ఉన్న బొమ్మలు చూస్తే ఎక్కడ ఏ పువ్వు కనిపించినా ఇట్టే గుర్తు పట్టేస్తారు.

ఈశ్వర్ ఔర్ బజార్, జసింతా కీ డైరీ, ల్యాండ్ ఆఫ్ ది రూట్స్‌తో సహా ఏడు పుస్తకాలు రాసింది.

'జిర్హుల్'లో పువ్వుల ప్రపంచం కనిపించినప్పటికీ అది అణగారిన వర్గాల కోసం ప్రతీకాత్మకంగా రాసిన పుస్తకం. ఆదివాసీ సంస్కృతి ఆధారంగా చేసుకొని పిల్లల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడమే ఈ పుస్తక లక్ష్యం. గాజాలో పదహారువేల మందికి పైగా చిన్నారులు మరణించారు. నెత్తుటేరులు పారాయి. ఈ నేపథ్యంలో 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్' అవార్డ్‌ను జసింత తిరస్కరించింది.



ఉద్యమ నేపథ్యం...

ఝార్ఖండ్‌లోని ఖుదపోష్ గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో పుట్టిన జసింత మాస్ కమ్యూనికేషన్, వీడియో ప్రొడక్షన్‌లో డిగ్రీ చేసింది. రాంచీలోని ఒక ప్రముఖ దినపత్రికలో పని చేసింది. కెరీర్ పరంగా ఎంత ముందుకు వెళ్లినా తన మూలాలను మాత్రం మరవలేదు. 'ఆదివాసీ అండ్ మైనింగ్ ఇన్ ఫైవ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఝార్ఖండ్' పేరుతో అధ్యయన పత్రాన్ని వెలువరించింది.

'ఇండిజినస్ వాయిస్ ఆఫ్ ఆసియా' అనే పరిశోధన పత్రానికి ఇండిజినస్ పీపుల్స్ ఫ్యాక్ట్ అవార్డు లభించింది. జర్నలిస్ట్‌గానే కాదు కవిత్వానికి సంబంధించి సృజనాత్మక రచనలతోనూ ఎన్నో అవార్డ్‌లు అందుకుంది. తన కవిత్వం విషయానికి వస్తే అది ఆకాశపల్లకిలో ఊరేగదు. జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా ఉంటుంది. గాయాలను గుర్తు తెచ్చుకునేలా ఉంటుంది. బూటకపు అభివృద్ధిని ప్రశ్నించేలా ఉంటుంది.

జసింత మనోహర్‌పూర్‌లోని మిషనరీ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న రోజుల్లో తల్లి పుష్ప అనిమ తండ్రి చేతిలో తరచు హింసకు గురయ్యేది. మరచిపోలేని ఆ హింసాత్మక దృశ్యాలు తన కవిత్వంలో కనిపిస్తాయి. వ్యక్తిగత చేదు అనుభవాలే కాదు అభివృద్ధి పేరుతో ఆదివాసీ గ్రామాల్లో జరుగుతున్న విధ్వంసం కూడా జసింత కవిత్వంలో కనిపిస్తుంది.

జసింత కెర్కెట్టా జర్నలిస్ట్ మాత్రమే కాదు సోషల్ యాక్టివిస్ట్ కూడా. బాలికల విద్యకు సంబంధించి ఎన్నో ఆదివాసీ గ్రామాల్లో పనిచేసింది. ఫోర్బ్స్ ఇండియా 'టాప్ 20 సెల్ఫ్‌మేడ్ ఉమెన్'లో ఒకరిగా ఎంపిక అయింది.